
శ్రీకృష్ణనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

శ్రీకృష్ణనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రెండోసారి నూతన అధ్యక్షులుగా కుట్ల నర్సింహ్మాయాదవ్ ఎన్నికవగా, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జి.ఉపేందర్, వి.యాదగిరి రావు, సహాయ కార్యదర్శులుగా పి.అంజయ్య యాదవ్, కె.ఆశీష్ రెడ్డి, పి.ప్రదీప్ గౌడ్, కోశాధికారిగా ఈ.శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జె.బబ్లు పవర్, పి.రాజు పవర్, కార్యవర్గ సభ్యులుగా ఎన్.నరేందర్, ఎ.కైలాస్, కె.లక్ష్మీనారాయణ, వి.కృష్ణారెడ్డి, టి.కిషోర్, ఎ.శశిధర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కుట్ల నర్సింహ్మా యాదవ్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. తమ నియామకానికి కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు క్షమాపణ చెప్పాకే సీఎంను కలవాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.118 ద్వారా ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం అవుతుందని చెప్పిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అదే విషయంపై ఇప్పుడు మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామనడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీఓ నెం.118 విషయంలో ప్రజలను ఎమ్మెల్యే మోసం చేశారని, ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పిన తరువాతే సీఎంను కలవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిజిస్ట్రేషన్ల సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వమే పరిష్కరిస్తుందన్నారు. దాన్ని తన ఖాతాలో వేసుకుందామని సుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే జీఓ నెం.118ని అప్పటి ప్రభుత్వం హడావిడిగా విడుదల చేసి సమస్య పరిష్కరించకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

వీరమరణం పొందిన అమర జవాన్లకు..

14న కొవ్వొత్తులతో ర్యాలీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 2019 ఫిబ్రవరి-14న పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన సీఆర్‌పీఎఫ్ అమర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించడానికి ఈనెల 14న కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నామని ఎక్స్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి కొత్తపేట పాతకోర్టు జంక్షన్ వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర మాజీ సీఏపీఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పౌరులు అధిక సంఖ్యలో పాల్గొని దేశం కోసం ప్రాణాలు అర్పించిన 40 మంది వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించాలని అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్ సుందర్‌రెడ్డి పేర్కొన్నారు.

కనకదుర్గానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని కనకదుర్గానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎ.జంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, సలహాదారుడిగా మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శిగా రఘునందన్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా వెంకన్న, డిప్యూటీ సెక్రెటరీగా దామోదర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సుధాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

పార్కులో సుందరీకరణ పనుల పునరుద్ధరణకు కృషి

కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్త పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పార్కులో సుందరీకరణ పనుల పునరుద్ధరణకు కృషి చేస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన నాగేశ్వర్‌రావు కాలనీ ప్రతినిధులతో కలిసి పార్కును సందర్శించారు. పార్కులో సుందరీకరణ పనులు ఆగిపోవడం, ప్రహరీ నిర్మాణం పూర్తికాకపోవడం, పక్కనే ఉన్న 150 చదరపు గజాల స్థలం స్టేటస్‌కో సమస్య, పార్కులో పారిశుధ్యం తదితర సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కాలనీ అధ్యక్షులు రాంనాథ్‌రెడ్డి, ప్రతినిధులు విజయభాస్కర్, రాకేష్‌యాదవ్, లక్ష్మీరాజం, నారాయణ పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ దేవాలయానికి సమతాదీక్ష ఆహ్వానం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమతాదీక్షకు భక్తులను ఆహ్వానించడానికి ఆదివారం శ్రీశ్రీశ్రీ అహోబల రామానుజ జీయర్‌స్వామి వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించారు. జీయర్‌స్వామికి ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జీయర్‌స్వామి ఆలయంలో అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారలను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు మంగళశాసనములు చేశారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎన్‌ఆర్‌ఐ లింగడి శ్రీకాంత్

సైదాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సాఫ్ట్‌వేర్ నిపుణుడు, ఎన్‌ఆర్‌ఐ లింగడి శ్రీకాంత్ అన్నారు. చంపాపేటలోని శ్రీ త్రివేణి స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక విద్యావిధానంలో ముందు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి, చైర్మన్ సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయ సాధనకోసం పాటుపడాలి

- కనులపండువగా రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు

కవాడిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని, అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. దేశంలోని యువత సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు. దోమలగూడలో రామకృష్ణమఠం స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, సహాయ ప్రధాన కార్యదర్శి తత్వ విదానంద స్వామి, పుణే రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీకాంతనంద, రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానానంద స్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలను అనుసరించాలని సూచించారు. స్వర్ణత్సోవాలలో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. భువనేశ్వర్ రామకృష్ణ మఠం తొలి అధ్యక్షులు బ్రహ్మానంద స్వామి జయంతి సందర్భంగా ఆయన జీవితంపై సందేశాలు, ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రామకృష్ణమఠంలో స్వర్ణోత్సవాల సందర్భంగా యాగంలో పాల్గొన్న స్వామీజీలు

పీవీకి భారతరత్న తెలుగు జాతికి గర్వకారణం

- పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన జ్ఞాని పీవీ నరసింహారావు అని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో అల్కాపురి చౌరస్తాలోని పీవీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ రాజకీయాలకు పీవీ స్ఫూర్తి దాయకులన్నారు. పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువరని, పీవీకి భారత రత్న ప్రకటించడం తెలుగు జాతికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ మండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, తలాటి రమేష్, గట్ల రవీంద్ర, మహేందర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌యాదవ్, సైదులు, లక్ష్మి, రేణుక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో...

బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజలకు ఎంతో గర్వకారణమని పీవీ నరసింహారావు జిల్లా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణరావు అన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అల్కాపురి చౌరస్తాలోని నరసింహారావు విగ్రహానికి బ్రాహ్మణ సంఘాల నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాంసుందర్‌రావు, మంత్రి సునీల్, రమాకుమార్ దేశ్‌ముఖ్, దేవులపల్లి రంగారావు, దేవులపల్లి అశోక్‌కుమార్, రాజేశ్వర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


అల్కాపురి చౌరస్తాలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి తదితరులు

కలుషిత నీటి నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- సీజీఎం నాగేందర్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని గడ్డిఅన్నారం హరిజన బస్తీలో సరఫరా అవుతున్న కలుషిత నీటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జలమండలి సీజీఎం నాగేందర్ ఆదేశించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో '2 నెలలుగా గడ్డిఅన్నారం హరిజన బస్తీకి కలుషిత నీటి సరఫరా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన జలమండలి మలక్‌పేట డివిజన్ జీఎం ఖాదర్ మోహియుద్దీన్, మేనేజర్ చంద్రునాయక్‌లతో కలిసి హరిజన బస్తీని సందర్శించారు. బస్తీలోని ఇళ్లకు సరఫరా అవుతున్న తాగునీరు ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సివరేజి సమస్య కారణంగానే తాగునీరు కలుషితమై సరఫరా అవుతుందని బస్తీలోని పలువురు మహిళలు సీజీఎం నాగేందర్‌కు ఫిర్యాదు చేశారు. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని ఆయన పరిశీలించారు. జలమండలి క్వాలిటీ కంట్రోల్ బృందంతో తాగునీటిని శాంపిల్స్‌ను సేకరించి పరీక్షించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదేవిధంగా ఇక్కడి అధికారుల బృందం కూడా నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షకు పంపాలన్నారు. బస్తీలో సివరేజి పైప్‌లైన్‌ను క్లీన్ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సివరేజి సమస్య శాశ్వత పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సీజీఎం నాగేందర్ మేనేజర్ చంద్రునాయక్‌ను ఆదేశించారు.


హరిజన బస్తీని సందర్శించిన జలమండలి సీజీఎం నాగేందర్, జీఎం ఖాదర్ మోహియుద్దీన్ తదితరులు

బీసీలకు రూ.8వేల కోట్లు కాదు.. రూ.20వేల కోట్లు కేటాయించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.8వేల కోట్లను మాత్రమే కేటాయించిందని, ఇవి ఏమాత్రం సరిపోవని, రూ.20 వేల కోట్లను కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల ఊసే లేదని, రూ.5,300కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు నందగోపాల్, టి.రాజేందర్, జిల్లపల్లి అంజి, మట్ట జయంతిగౌడ్, పృథ్వీగౌడ్, దినేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, గవ్వల భరత్‌కుమార్ తదితరులు

ఘనంగా బాలయేసు మహోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ బాలయేసు మహోత్సవం (ఉరిపండగా) ఆదివారం ఘనంగా జరిగింది. తేరు ప్రదక్షిణలో భాగంగా ఉదయం 6 గంటలకు నగరంలోని బోయిగూడ చర్చి నుంచి బాలయేసు విగ్రహాన్ని ఊరేగింపునకు కమ్మగూడకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ చిన్నప్పరెడ్డి, మున్సిపాలిటి కో-ఆప్షన్ సభ్యురాలు కాకుమాను మరియమ్మ చిన్నయ్య, కౌన్సిలర్ సునీల్‌తోపాటు కమ్మగూడకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు, గ్రామస్తులు తేరుకు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం నాలుగు నుంచి ఐదు గంటల వరకు దివ్య బలిపూజ తెలుగులో ఫాదర్ చిన్నప్పరెడ్డి చేశారు. ఉదయం 11 గంటలకు బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ తెలుగులో హైదరాబాద్ అతిమేత్రాణులు కార్డినల్ పూల ఆంథోని చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వస్థత ప్రార్థనలు ఫాదర్ పి.జీవన్‌బాబు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. క్రైస్తవులతోపాటు స్థానిక ప్రజలు కూడా బాలయేసును దర్శించుకున్నారు.

వీరభోగ వసంతరాయలుకు విశ్వగురు అవార్డు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎల్బీనగర్‌కు చెందిన వైద్యులు డాక్టర్ వీరభోగ వసంతరాయలు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డు-2024ను అందుకున్నారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వారు వివిధ రంగాలలో ఉత్తమ సేవ అందజేస్తున్న వారికి అవార్డులు బహుకరించింది. అందులో భాగంగా వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న వీరభోగ వసంతరాయలుకు 2024 సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ చేతుల మీదుగా వీరభోగ వసంతరాయలు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. సామాజిక, వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తానని ఆయన చెప్పారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.


విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతి

శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా బద్దం వెంకట్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా మిద్దెల మల్లేషంగౌడ్, ఉపాధ్యక్షులుగా చెరుకు స్వామిగౌడ్, లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా రాజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.


వెంకట్‌రెడ్డి

ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ ఇంట్లో చెలరేగిన మంటలు

- పేలిన గ్యాస్ సిలిండర్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు చెందిన ఇంట్లోని మొదటి అంతస్తులో కొంతకాలంగా కోటగిరి విజయలక్ష్మి నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఫ్రిజ్ నుంచి పొగలు రావడం ఆమె గమనించింది. వెంటనే మొదటి అంతస్తు నుంచి కిందకు దిగివచ్చి అక్కడ ఉన్న వారికి విషయాన్ని చెప్పింది. క్షణాల్లోనే ఆ గదిలో భారీ మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంట ల దాటికి ఫ్రిజ్‌లోని గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట గ్యాస్ సిలిండర్ భారీ శబ్ధంతో పేలా యి. ఈ సమాచారాన్ని హయత్‌నగర్, రామోజీ ఫిల్మ్‌సిటీలోని అగ్నిమాపక సిబ్బందికి చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫిల్మ్‌సిటీ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. విజయలక్ష్మి దాచుకున్న రూ.12వేలతోపాటు దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

తక్షణ సాయం కింద రూ.5 వేలు

విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం కింద తహసీల్దార్ రూ.5వేలు మంజూరు చేశారు. ఆ నగదును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, సత్తయ్య, సాంబయ్య, మహేందర్, నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.


పూర్తిగా కాలిపోయిన గది, అందులోని వస్తువులు

కరెంట్ షాక్‌తో కార్మికుడి మృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ సాదత్‌నగర్‌కు చెందిన సద్దాంషేక్ బక్షూ(32) భవన నిర్మాణ మేస్త్రీ. అలీనగర్‌లోని ఓ భవనం రెండో అంతస్తులో ఆదివారం అల్యూమినియం రాడ్‌తో ఫ్లో రింగ్ పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తాకింది. కరెంట్ షాక్ కొట్టడంతో అతడు పక్కనే ఉన్న మెట్లపై పడ్డాడు. వెంటనే సమీపంలోని ఒవైసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. భార్య హీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డిని సన్మానిస్తున్న క్లబ్ నూతన అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ శ్రీనివాసచారి తదితరులు

శాలివాహన వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి ప్రమాణ స్వీకారం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శాలివాహన వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా కానుగంటి నర్సింహారెడ్డి ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ శ్రీనివాసచారి చేతుల మీదుగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయగా, గౌరవ అతిథులుగా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్లపల్లి చక్రపాణి, వంగాల ప్రవీణ్‌రెడ్డి, జెక్కా మోహన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ బి.గంగాధర్‌రెడ్డి, కె.సంపత్‌రెడ్డి రీజినల్ కౌన్సిలర్ జె.సత్యనారాయణ యాదవ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, చీఫ్ కోఆర్డినేటర్లు వి.మాధవరావు, సంపత్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికైన ఎస్‌హెచ్‌కె. ప్రసాద్ విచ్చేశారు. క్లబ్ ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, ప్రేంకుమార్‌యాదవ్, కార్యదర్శి కమలాకర్, సంయుక్త కార్యదర్శులుగా అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా లచ్చయ్య, పురుషోత్తం, పీఆర్‌వోగా నారం హన్స్‌రాజ్, కోశాధికారిగా యాదయ్య యాదవ్ ప్రమాణ స్వీకారం చేసినవారిలో ఉన్నారు. శాలివాహన వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ శ్రీనివాసచారి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో నడవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. నడువు, నడిపించు అనే నినాదంతో ఏర్పాటైన శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని నూతన అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బొంగు వెంకటేశ్‌గౌడ్

హయత్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా లింగోజిగూడకు చెందిన బొంగు వెంకటేష్‌గౌడ్‌ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం నియామక పత్రాన్ని వెంకటేశ్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని అన్నారు. జిల్లాలో పర్యటించి బలహీనవర్గాలను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించేలా తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. పదవి రావడానికి తనకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, నరసింహగౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


వెంకటేశ్‌గౌడ్

హైదరాబాద్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పవన్

సైదాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శిగా మాదన్నపేటకు చెందిన దర్శనం పవన్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు వల్లులియా సమీర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నగరంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తనవంతు పాత్ర పోషిస్తానని చెప్పారు. అంతేగాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు.


దర్శనం పవన్

ప్రభుత్వం న్యాయం చేయాలి : చైర్మన్ వెంకట్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూమిని ప్రభుత్వం సభ్యులకు అప్పగించి న్యాయం చేయాలని సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి కోరారు. సింగరేణి కాలనీలో సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. 1981లో ప్రభుత్వం నుంచి 25ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. 1995లో ప్రభుత్వం సొసైటీ సభ్యులకు నోటరైజ్‌డ్ డాక్యుమెంట్లు ఇచ్చిందని వివరించారు. అదేవిధంగా 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ నెంబర్ 727 ప్రకారం సింగరేణి కాలనీలోని 25ఎకరాల స్థలాన్ని 247సభ్యులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించిందని అన్నారు. హౌసింగ్ సొసైటీ కొనుగోలు చేసినా ఇప్పటికీ తమకు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కాలక్రమేణ ఆ భూమిలో కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. గుడిసెవాసులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించి సొసైటీ సభ్యులకు స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ కన్వీనర్ కె.ఎస్.ఆర్.మూర్తి, ప్రెసిడెంట్ బాలప్రసాద్, కోకన్వీనర్ ఉదయ్‌చంద్, కోశాధికారి మల్లికార్జునశెట్టి పాల్గొన్నారు.

ఆర్గానిక్ టిఫిన్ సెంటర్ ప్రారంభం

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో ఆర్గానిక్ టిఫిన్ సెంటర్‌ను నాయకులు నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ హరి శంకర్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు ఈదమ్మల బలరాం, సుప్రసేనారెడ్డి నిర్వహకులు అనిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోర్క రాముముదిరాజ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్ పాల్గొన్నారు. - అబ్దుల్లాపూర్‌మెట్. ఆంధ్రజ్యోతి





హనుమాన్ సినిమా డైరెక్టర్ ప్రశాంత్ వర్మను సన్మానిస్తున్న ప్రతినిధులు

విద్యార్థుల్లో దేశభక్తి నింపుతున్న ఘనత సరస్వతి విద్యాపీఠందే

- హనుమాన్ సినిమా డైరెక్టర్ ప్రశాంత్ వర్మ

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాలను నేర్పిస్తూ విద్యార్థులకు దేశభక్తిని నింపి ప్రపంచానికి పరిచయం చేస్తున్న ఘనత సరస్వతి విద్యాపీఠందేనని హనుమాన్ సినిమా డైరెక్టర్ పి.ప్రశాంత్ వర్మ అన్నారు. సరస్వతినగర్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 51వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కారక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రశాంత్‌వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో 20సంవత్సరాల క్రితం చదివిన జ్ఞాపకాలను గుర్తుకుచేసుకొని విద్యార్థులతో పంచుకున్నారు. పాఠశాల ప్రధాన ఆచార్య లక్ష్మి ఎప్పుడు సంకల్పం అని అనేవారని ఆదే సంకల్పంతో నేను ఈ స్థాయికి వచ్చాను అని చెప్పారు. విద్యార్థులు చదువుతో అన్ని రంగాలలో రాణించాలన్నారు. పాఠశాల నిర్వహించిన పలు క్రీడా పోటీలలో గెలపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు పురుషోత్తంరావు, సమతి అధ్యక్షులు సుందర్‌రెడ్డి, డిప్యూటీ డీఇఓ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.